సాక్షి తిరుపతి

గురువారం । 12 । సెప్టెంబర్ । 2024



కుప్పంలో తమ్ముళ్ల దందాలు

సీఎం చంద్రబాబు ప్రాతినిథ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గాన్ని టీడీపీ శ్రేణులు స్మగ్లింగ్‌కు అడ్డాగా మార్చేశారు. - 8లో



నిమజ్జనం.. పులకించిన భక్తజనం

తిరుపతి జిల్లావ్యాప్తంగా ఐదోరోజు గణనాథుడి ప్రతిమలను ఊరేగింపుగా తెచ్చి నిమజ్జనం చేశారు. - 8లో



బరి తెగించిన టీడీపీ నేతలు

చిన్నగొట్టిగల్లు మండల్ మీట్ జరగకుండా టీడీపీ నేతలు అడ్డుకున్నారు. ఎంపీపీపై దాడికి యత్నిస్తే, పోలీసులు అడ్డుకున్నారు. - 8లో

న్యూస్‌రీల్

11 అతిథి ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు

తిరుపతి అర్బన్: జిల్లాలోని గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో అతిథి ఉపాధ్యాయులుగా పని చేయడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఏపీ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా సమన్వయకర్త టి.పద్మజ తెలిపారు. జిల్లాలోని ఏడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయని, వీటిలో 11 గెస్ట్ టీచర్ల పోస్టులను భర్తీ చేస్తున్నట్లు చెప్పారు. ఆంగ్ల మాధ్యమంలో బోధనకు గెస్ట్ టీచర్లను తీసుకుంటున్నామని, బీఈడీతోపాటు టెట్‌లో అర్హత సాధించి ఉండాలన్నారు. అంతేకాకుండా పీజీలో 55 శాతం మార్కులు సాధించి ఉండాలని తెలిపారు. ఈ నెల 17వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు కలెక్టరేట్‌లోని ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐ జిల్లా కోఆర్డినేటర్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. 18వ తేదీ ఉదయం 10 గంటలకు నాయుడుపేట సమీపంలోని బిరదవాడ వద్ద ఉన్న గురుకుల పాఠశాలలో డెమో ఉంటుందని, ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తామని స్పష్టం చేశారు. గెస్ట్ టీచర్ల పోస్టులకు సంబంధించి స్త్రీల విభాగంలో జూనియర్ లెక్చరర్లు(కెమిస్ట్రీ)-01, అర్థికశాస్త్రం-01, కామర్స్ -01, హిందీ-01, మ్యాథ్స్-02, సోషియల్ స్టడీస్-02, పురుషుల విభాగంలో జేఎల్‌గా మ్యాథ్స్-01, పీజీటీ మ్యాథ్స్-01, హిందీ-01 ఖాళీలు ఉన్నట్లు వెల్లడించారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో బుధవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్టుమెంట్లు ఖాళీగా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 62,380 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. 21,405 మంది తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.95 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ దర్శన టికెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 8 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన వారికి 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఐసర్‌కు రెండు ఆర్టీసీ బస్సులు

తిరుపతి అర్బన్: ఏర్పేడు సమీపంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐసర్)కు ఆర్టీసీ అధికారులు తిరుపతి నుంచి రెండు సర్వీసులను ఏర్పాటు చేశారు. మంగళం డిపో నుంచి రెండు ఆర్డినరీ సర్వీసులను ఉదయం ఒకటి, సాయంత్రం ఒకటి ఐసర్‌కు ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లోని శ్రీహరి బస్టాండ్ వెంకటగిరి ప్లాట్‌ఫాం-20 నుంచి ఈ సర్వీసులు ప్రతిరోజు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. అంతేకాకుండా తిరుపతి నుంచి వెంకటగిరికి వెళ్లే ఎక్స్‌ప్రెస్‌లు 06, ఆర్డినరీ సర్వీసులు 06 తప్పకుండా ఐసర్ వద్ద ఆగేలా ఆర్టీసీ అధికారులు ఆదేశాలు ఇచ్చారు.

15 వరకు డిగ్రీ మూడవ విడత కౌన్సెలింగ్ పొడిగింపు

తిరుపతి సిటీ: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, టీటీడీ కళాశాలల్లో మూడవవిడత డిగ్రీ అడ్మిషన్లకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈనెల 15వ తేదీ వరకు పొడిగిస్తూ అన్ని డిగ్రీ కళాశాలల యాజమాన్యాలకు ఉన్నత విద్యామండలి బుధవారం సమాచారం అందించింది. ఈనెల 18 వరకు వెబ్‌ఆప్షన్లకు అవకాశం కల్పించి, 19న వెబ్ ఆప్షన్ల మార్పు చేసుకునేందుకు అభ్యర్థులకు వెసులుబాటు కల్పించింది.

పులివెందుల మెడికల్ కళాశాలకు సీట్లు కేటాయించాలి

తిరుపతి ఎడ్యుకేషన్ : పులివెందుల మెడికల్ కళాశాలకు మూడవ విడత కౌన్సెలింగ్‌లో సీట్లు కేటాయించాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పులివెందుల మెడికల్ కళాశాలకు జాతీయ మెడికల్ కౌన్సెల్ అనుమతులు ఇచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం సీట్లు కేటాయించవద్దని ఎన్‌ఎంసీకి లేఖ రాయడం సిగ్గుచేటని విమర్శించారు. రాష్ట్రంలో వేలాది మంది విద్యార్థులు కోచింగ్ కోసం రూ.లక్షలు చెల్లించి, ర్యాంకులు సాధిస్తే నేడు సరిపడా సీట్లు లేక ఇతర దేశాల్లో వైద్య విద్యను అభ్యసించేందుకు వెళ్లాల్సి రావడం బాధాకరమని తెలిపారు.

రూ.10 నాణేలకు మోక్షం

తిరుపతి అర్బన్: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు జారీ చేసిన పదిరూపాయిల కాయిన్స్(నాణేలు)ను ప్రయాణికుల నుంచి ఆర్టీసీ కండక్టర్లు తప్పక తీసుకోవాలని ఆర్టీసీ విజయవాడ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఆపరేటర్స్)చంద్రశేఖర్ నుంచి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రిజర్వ్ బ్యాంక్ 14 రకాల పది రూపాయిల నాణేలను విడుదల చేసినట్లు స్పష్టం చేశారు. పెద్దఎత్తున ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలోనే వాటిని తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేశామన్నారు. దీనిపై ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని ఆదేశాలు జారీచేశారు.

ఎట్టకేలకు మోక్షం..

పది రూపాయిల కాయిన్స్ 14 రకాలు ఉండడంతో ఏది నిజమైన నాణెమో, ఏది డూప్లికేటో తెలియక వ్యాపారులు తీసుకోవట్లేదు. అయితే ఆర్టీసీ నుంచి వచ్చిన ఉత్తర్వులు భరోసా కల్పించాయి. దీంతో పది రూపాయిల నాణేలకు మోక్షం వచ్చిందని అంతా భావిస్తున్నారు.

పెట్ ఫ్రెండ్స్

నగర వాసుల ఆలోచనా విధానంలో మార్పులు వచ్చాయి. దైనందిన జీవితంలో జంతువులూ కుటుంబాల్లో భాగమవుతున్నాయి. జంతు ప్రేమికులు సమాజంలో ఎక్కువయ్యారు. వాటి కోసం ప్రత్యేకంగా ఆహారం, సంరక్షణ, పోషకాహారం కోసం రూ.లక్షలు వెచ్చిస్తున్నారంటే వాటి పట్ల ఎంత ఇష్టం పెంచుకుంటున్నారో అర్థం అవుతోంది. మనుషుల కంటే పెట్స్‌తోనే ఎక్కువ గడిపేస్తున్న జంతు ప్రేమికులు ఉన్నారు. అలాంటి వారిపై సాక్షి ప్రత్యేక కథనం



- నగర వాసుల్లో పెరిగిన పెట్ కల్చర్
- కుటుంబంలో ఒకరిగా పెంపుడు జంతువులపై ప్రత్యేక మమకారం
- వ్యాధుల బారిన పడకుండా వాటి నిరంతర పర్యవేక్షణకు ఓ డాక్టర్
- బ్రీడ్‌కు అనువైన పోషకాహారానికి రూ.లక్షలు వెచ్చిస్తున్న జంతు ప్రేమికులు
- ప్రత్యేకంగా పెట్స్‌తో కలిసి వాకింగ్, ప్లేయింగ్
- న్యూట్రిషన్ ఫుడ్ కోసం ఆన్‌లైన్‌లో ఆర్డర్లు
- 'బివేర్ ఆఫ్ డాగ్స్' అంటూ వెటర్నరీ డాక్టర్ల సంకేతాలు



గోల్డెన్ రీట్రీవర్ జాతి డాగ్‌ను పెంచుకుంటున్న డాక్టర్ కుటుంబ సభ్యులు



తిరుపతి సిటీ: గతంలో ఇళ్లకు కాపలాగా శునకాలను పెంచుకునేవారు. ప్రస్తుత ఆధునిక యుగంలో పెట్ కల్చర్ ఒక హోదాగా మారింది. మధ్యతరగతి కుటుంబాల నుంచి ఉన్నత వర్గాల వరకు పిల్లి, శునకాలను పెంచుకుంటున్నారు. స్థానిక బ్రీడ్‌తో పాటు రూ.వేలు, రూ.లక్షలు వెచ్చించి ఆకట్టుకునే వందల రకాల ఫారిన్ బ్రీడ్ పెట్స్‌ను కొనుగోలు చేస్తున్నారు. శునకాల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించి వ్యాధుల బారిన పడకుండా ఫ్యామిలీ డాక్టర్లను నియమించుకుంటున్నారు. వాటికి పోషక విలువలు కలిగిన ఆహారం అందించేందుకు న్యూట్రిషన్ ఫుడ్ కోసం తిరుపతి మార్కెట్‌లో లభించే కొత్తరకం ఫీడ్‌లతో పాటు చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ వంటి మహా



పెట్‌లకు అందుబాటులో ఉన్న ఫుడ్

నగరాల నుంచి ఆన్‌లైన్‌లో ఆర్డర్లు పెడుతున్నారు.

బివేర్ ఆఫ్ డాగ్స్ అంటూ సంకేతాలు..

పెంపుడు జంతువుల ఆహారంలో పెట్ యజమానులు జాగ్రత్తలు వహించాలి. బ్రీడ్ జాతిని బట్టి ఆహారం ఇవ్వాలి. అలాకాకుండా బలవంతంగా ఆహారం పెడితే మానసిక ఒత్తిడికి లోనై వాటి ప్రవర్తనలో మార్పు కనిపిస్తుంది. ఎంతో అల్లారుముద్దుగా పెంచుకున్న శునకాలు సైతం యజయానులపైకే దాడికి దిగే అవకాశం ఉంటుంది. ఇందులో రాట్‌వీలర్ జాతికి చెందిన డాగ్స్ మరీ డేంజర్ అని వైద్యులు చెబుతున్నారు. ఏడాది క్రితం అనంతరంపురం జిల్లా గుంతకల్లులో రాట్ వీలర్ జాతి పెంపుడు కుక్క 150 సార్లు యజయానిపై దాడి చేసి గాయపరిచింది. కనీసం రోజుకు 5 నుంచి 6 గంటల పాటు విశాలమైన ప్రాంతంలో యజమాని పర్యవేక్షణలో కలివిడిగా తిరగనివ్వాలి. కార్బొహైడ్రేడ్స్, ప్రొటీన్స్, విటమిన్స్ కలయికతో వెజిటిబుల్, మాంసాహారం, రైస్‌ను కలిపి తగిన మోతాదులో ఇవ్వాలి. జర్మన్ షెఫర్డ్, గోల్డెన్ రీట్రీవర్, లాబ్‌రిట్రీవర్, రాట్‌వీలర్ లాంటి లార్జ్ బ్రీడ్స్‌కు 500 గ్రాముల నుంచి ఒక కేజీ వరకు ఆహారం ఇవ్వాలి. హోమ్ ఫుడ్ 150 గ్రాములు, 350 గ్రాముల వరకు డాగ్ ఫుడ్ ఉండేటట్లు జాగ్రత్తలు తీసుకోవాలి. స్ట్రీట్ డాగ్స్‌తో కలవనీకుండా అప్రమత్తంగా ఉండాలి. వ్యాధి సోకిన సమయంలో చిన్నపిల్లలను పెట్‌లకు దూరంగా ఉంచాలి. వాటి శ్వాస చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పెట్ క్లీనింగ్, స్లీపింగ్ బెడ్‌లు పరిశుభ్రంగా ఉంచుకోవాలి.



తిరుపతి మార్కెట్‌లో లభిస్తున్న పలురకాల డాగ్ న్యూట్రిషన్ ఫుడ్

పెట్స్ కోసం ఓ డాక్టర్ ..

మనుషుల ఆరోగ్యం కోసం జాగ్రత్తలు తీసుకున్నట్లుగానే పెట్స్ కోసం వెటర్నరీ డాక్టర్లను నియమించుకుంటున్నారు. దీంతో వారు ఇళ్లకు వెళ్లి కుక్కలను పరీక్షిస్తున్నారు. తిరుపతి నగరంలో సుమారు 2 వేల సంపన్న వ్యక్తుల ఇళ్లలోని పెట్స్‌కు ఫ్యామిలీ డాక్టర్లు ఉన్నట్లు వెటర్నరీ వైద్యనిపుణులు అంచనా. అలాగే పెంపుడు శునకాలను ఎక్కువ సమయం ఇళ్లలోనే ఉంచడం వల్ల మనుషుల తరహాలో అవి కూడా ఒబెసిటీ బారిన పడుతున్నాయి. స్థూలకాయం దరి చేరకుండా మార్నింగ్ వాక్‌తో పాటు ఆహారపు అలవాట్లలోనూ సంరక్షకులు పెను మార్పులు పాటిస్తున్నారు. మానసికంగా ఉల్లాసంగా ఉండేందుకు శారీరక శ్రమ కలిగించే విధంగా ఆహారపు మోతాదును తగ్గించి వాకింగ్, ట్రాకింగ్ వంటి వ్యాయామాలు, ఆటల్లో తర్ఫీదు ఇస్తున్నారు. అలాగే పెట్స్ ఎదుగుదల, మానసిక స్థితి వాటికి ఇచ్చే ఆహారంపై ఆధారపడి ఉంటుంది. పెట్ బ్రీడ్ ఆధారంగా న్యూట్రిషన్ ఫుడ్, సాధారణ ఆహారంతో పాటు పోషక విలువలు ఎక్కువగా ఉండే స్నాక్స్, మాంసంతో చేసిన ఉత్పత్తులను డాక్టర్ల సలహా మేరకు అందిస్తారు. ఇందులో భాగంగా ఫుల్లర్స్, డాట్‌గుడ్ వంటి వెరైటీ ఉత్పత్తులపై పెట్ లవర్స్ మొగ్గు చూపుతున్నారు. వాటిని ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెట్టుకుంటున్నారు.

ఒబేసిటీ రాకుండా..



గోల్డెన్ రీట్రీవర్ జాతికి చెందిన డాగ్‌ను పెంచుకుంటున్నాం. ఇంట్లో వ్యక్తిగా పెంచుతున్నాం. ఎగ్స్, మీట్, చికెన్, వెజిటెబుల్స్, ఫ్రూట్స్, రైస్‌తో పాటు మార్కెట్‌లో దొరికే డాగ్ న్యూట్రిషన్ ఫుడ్ ఇస్తున్నాం. రాయల్ కెనాన్‌తో పాటు ఫుల్లర్స్, డాట్‌గుడ్ వంటి వెరైటీలను ఆన్‌లైన్ ద్వారా తెప్పించి, ఒబేసిటీ రాకుండా చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. నెలకు రూ.10 నుంచి రూ.15 వేల వరకు ఖర్చు అవుతోంది.

– చేతన, పెట్ యజమానురాలు, పీజీ విద్యార్థిని, తిరుపతి

కుటుంబ సభ్యుల్లో ఒకటిగా..



ప్రాణానికి ప్రాణంగా మా కుటుంబ సభ్యుల్లో ఒకరిగా లాబ్‌రీట్రివర్ జాతికి సంబంధించిన బ్రీడ్‌ను పెంచుకుంటున్నాం. మనుషుల కంటే ఎంతో విశ్వాసంగా ఉంటుంది. టైం ప్రకారం న్యూట్రిషన్ ఫుడ్ అందిస్తున్నాం. నెలకు సుమారు రూ.6 వేల నుంచి రూ.8 వేల వరకు ఖర్చు అవుతోంది. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం తప్పకుండా వాకింగ్ చేయిస్తున్నాం. దీని సంరక్షణకు ఇంట్లో ఒక మనిషిని ప్రత్యేకంగా కేటాయిస్తున్నాం.

– అంజలి, గృహిణి, తిరుచానూరు

రూ.10 వేల పైనే ఖర్చు ..



జర్మన్ షెఫర్డ్ జాతికి చెందిన కుక్కను పెంచుకుంటున్నాం. దీని ధర ప్రస్తుతం మార్కెట్‌లో రూ.30 వేలకు పైమాటే. వయసు రెండేళ్లు. విశ్వాసానికి పెట్టింది పేరు. కుటుంబంలో ఒకరిగా భావిస్తున్నాం. మమ్మల్ని వదిలి ఒక్క క్షణం కూడా ఉండలేదు. రైస్, నాన్‌వెజ్, ఎగ్ రోజూ ఆహారంగా ఇస్తున్నాం. బరువు పెరగకుండా ప్రతి రోజు 6 కి.మీ. మేర వాకింగ్, ట్రెక్కింగ్ చేయిస్తున్నాం. ఆహారానికి మాత్రమే నెలకు కనీసం రూ.10 వేలకు పైగా ఖర్చు అవుతోంది.

– చైతన్య, చంద్రగిరి

అప్రమత్తత అవసరం



పెంపుడు జంతువులను పెంచుకునే వారు వాటి సంరక్షణలో అప్రమత్తంగా వ్యవహరించాలి. ఎప్పటికప్పుడు క్రమం తప్పకుండా సీజనల్ వ్యాధులు సంక్రమించకుండా టీకాలు వేయించాలి. పెట్స్ జాతిని బట్టి ఆహారం, అందించాలి. ప్రతిరోజూ శుభ్రంగా ఉంచాలి. ఇన్‌ఫెక్షన్ సోకిన పెట్‌లకు పిల్లలను చాలా దూరంగా ఉంచాలి. మానసిన స్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, ప్రవర్తనలో మార్పు వస్తే దగ్గరలోని వెటర్నరీ క్లినిక్‌లను సంప్రదించాలి.

– నాగేంద్రరెడ్డి, ప్రభుత్వ వెటర్నరీ వైద్యాధికారి, నగరపాలక సంస్థ, తిరుపతి

రూ.4 లక్షల విలువైన వైద్య పరికరాల వితరణ

శ్రీసిటీ (వరదయ్యపాళెం): శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో శ్రీసిటీలోని ఇసుజు మోటార్స్ ఇండియా పరిశ్రమ తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా రూ.4 లక్షల విలువైన వైద్య పరికరాలను చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వితరణగా అందజేశారు. బుధవారం ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇసుజు పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ సెంథిల్ మనోహర్, జనరల్ మేనేజర్ తకాషి రికుకావా, శ్రీసిటీ ప్రతినిధులు నిరీషా సన్నారెడ్డి, రమేష్ కుమార్ సమక్షంలో పరిశ్రమ ప్రతినిధులు ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనితకు పరికరాలను అందించారు. ఈ సందర్భంగా సెంథిల్ మనోహర్ మాట్లాడుతూ తమ సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా శ్రీసిటీ ప్రాంతంతో పాటు పరిసర గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేయనున్నట్లు పేర్కొన్నారు. ఇసుజు సీఎస్ఆర్ చొరవను శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తమ సందేశంలో అభినందించారు. కార్యక్రమంలో శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ జనరల్ మేనేజర్ సురేంద్ర కుమార్ పాల్గొన్నారు.



చిన్న పాండూరు పీహెచ్‌సీకి వైద్య పరికరాలను అందజేస్తున్న శ్రీసిటీ ఇసుజు పరిశ్రమ ప్రతినిధులు

వరద బాధితులకు ఉద్యోగుల సాయం

తిరుపతి అర్బన్: వరదలతో పెద్దఎత్తున నష్టపోయిన విజయవాడ బాధితుల కోసం అధికారులు కింది స్థాయి ఉద్యోగుల నుంచి డబ్బు వసూలు చేస్తున్నారు. జిల్లాలోని ఉన్నతస్థాయి ఉద్యోగుల ఆదేశాలతో ఆయా విభాగాల అధికారులకు ఇచ్చిన సూచనల మేరకు శాఖల వారీగా డివిజన్ అధికారులు, మండలస్థాయి ఉద్యోగుల నుంచి వసూళ్లు చేస్తున్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ తమ నెల జీతంలో సగం వరద బాధితులకు ఇస్తున్నట్లు పలువురు ప్రకటించారు. ఆ వెంటనే డీఆర్వో పెంచల కిషోర్ రూ.25 వేలు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి రూ.25 వేలు విరాళం అందించారు. బుధవారం వ్యవసాయశాఖ జిల్లా అధికారి ఎస్.ప్రసాద్ రావు, ఏడీఏలు ధనంజయరెడ్డి, మనోహర్, ఏఓ గాయత్రి తదితరులు తమ శాఖ నుంచి రూ.లక్ష చెక్కును కలెక్టర్‌కు అందించారు. అదేవిధంగా డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ రూ.23,100 డీడీని కలెక్టర్‌కు అందించారు. అదేబాటలో పలు విభాగాలకు చెందిన అధికారులు వరద బాధితుల కోసం నగదు వసూళ్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. గృహనిర్మాణశాఖ జిల్లా అధికారి వెంకటేశ్వరావు నేతృత్వంలో ఆ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగుల నుంచి వసూలు చేసిన రూ.లక్ష చెక్కును జిల్లా కలెక్టర్‌కు హౌసింగ్ ఉద్యోగులు అందజేశారు.





విరాళం చెక్కులను కలెక్టర్‌కు అందజేస్తున్న వ్యవసాయశాఖ ఉద్యోగులు, గృహనిర్మాణశాఖ ఉద్యోగులు

పీఎం శ్రీతో అద్భుత ఫలితాలు



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్



మధ్యాహ్న భోజనం తింటున్న కలెక్టర్, డీఈఓ

- జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

రేణిగుంట: ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా కార్యక్రమం(పీఎం శ్రీ) పథకం విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడుతుందని, రేణిగుంట బాలికోన్నత పాఠశాలలో ఈ పథకం అమలు తీరు బేషుగ్గా ఉందని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ కితాబిచ్చారు. మంగళవారం రేణిగుంట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ముందుగా ప్రాంగణంలోని సరస్వతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆరో తరగతి విద్యార్థినులు ల్యాబ్‌లో ట్యాబ్‌లను వినియోగించి చేస్తున్న బేసిక్ గణితం లెర్నింగ్‌ను పరిశీలించారు. ఎంపీసీ సెకండియర్ విద్యార్థినులకు ఐఎఫ్‌బీ ప్యానెల్స్ వినియోగించి బోధిస్తున్న ఉపాధ్యాయురాలితో మాట్లాడారు.

టీచర్‌గా మారిన జిల్లా కలెక్టర్..

విద్యార్థినుల ఆసక్తిని గమనించిన జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ టీచర్‌గా మారి పాఠాలు బోధించారు. సబ్జెక్ట్‌పై పట్టు ఉండేలా, దాని అప్లికేషన్ ఎక్కడ వాడతారు అనేదానిపై అవగాహన ఉంటే పోటీ పరీక్షల్లో రాణించవచ్చని వివరించారు. పాఠశాల ఆవరణలోని ఆట స్థలాన్ని పరిశీలించి ఎన్‌ఆర్‌ఈజీఎస్ అనుసంధానంతో పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పథకంలో భాగంగా విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని డీఈఓ శేఖర్‌తో కలిసి తిన్నారు. అనంతరం సమగ్ర శిక్ష కింద ఏర్పాటు చేసిన ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ గదిని పరిశీలించి విద్యార్థినులు తయారు చేసిన వివిధ బొమ్మలను పరిశీలించారు. మొదటి విడతలోని 23 పాఠశాలల్లో పది కెమిస్ట్రీ ల్యాబ్‌లకు ఒక్కొక్కటి రూ.15.58 లక్షల నిధులతో పనులు పురోగతిలో ఉన్నాయని, 21 పాఠశాలల్లో క్రీడా ప్రాంగణాల అభివృద్ధికి ఒక్కో స్కూల్‌కు రూ.5 లక్షల నిధులతో చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్డీఓ శంకర్ రెడ్డి, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి శివశంకర్, డిప్యూటీ డీఈఓ బాలాజీ, రాస్ కేవీకే హెడ్ డా.శ్రీనివాస్, సర్వశిక్షా ప్లానింగ్ అధికారి రామచంద్ర రెడ్డి, రేణిగుంట తహసీల్దార్ సురేష్, ఎంపీడీఓ విష్ణు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పీజీ కోర్సుల్లోనూ అడ్మిషన్లు అంతంతే !

తిరుపతి సిటీ: ఎస్వీయూలో తొలివిడత పీజీ అడ్మిషన్లు పరిస్థితి విస్మయానికి గురి చేస్తోంది. ఏపీపీజీ సెట్-2024లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు తొలివిడత అడ్మిషన్ల ప్రక్రియ గురువారంతో ముగియనుంది. అడ్మిషన్లు పొందిన విద్యార్థులు గురువారం సాయంత్రం 5 గంటల్లోపు వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సి ఉంది. వర్సిటీలో తొలివిడత అడ్మిషన్లలో భాగంగా ఇప్పటివరకు ఆర్ట్స్ గ్రూపులకు సంబంధించి కనీసం 20 శాతం సీట్లు కూడా భర్తీ కాకపోవడం, మరికొన్ని కోర్సుల్లో సింగిల్ డిజిట్ అడ్మిషన్లు జరుగుతుండడంపై అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే సైన్స్ విభాగాలలో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ కోర్సులో 55 శాతం, ఫిజిక్స్‌లో 50 శాతం, కామర్స్ అండ్ కంప్యూటర్స్ విభాగాలలో 30 శాతం మాత్రమే సీట్లు భర్తీ అయ్యాయి. రెండో విడత కౌన్సెలింగ్‌లో అయినా కనీసం 50 శాతం అడ్మిషన్లు భర్తీ అయ్యేనా అంటూ వర్సిటీ అధికారులు, విభాగాధిపతులు ఎదురు చూస్తున్నారు. పద్మావతి మహిళా వర్సిటీలో తొలివిడతలో సుమారు 60శాతం పైగా అడ్మిషన్లు జరిగాయి.

క్లుప్తంగా

అమ్మవారి సేవలో కేంద్రమంత్రి



ఆలయం వెలుపల కేంద్ర మంత్రి సురేష్ గోపి

చంద్రగిరి(తిరుచానూరు) : తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని కేంద్ర మంత్రి సురేష్ గోపి కుటుంబ సమేతంగా సేవించుకున్నారు. బుధవారం ఆలయం వద్ద ఆయనకు ఏఈఓ రమేష్, సూపరింటెండెంట్ చంద్రశేఖర్ స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రిజర్వ్ ఫారెస్ట్‌లో అంత్యక్రియలు



అటవీప్రాంతంలో దహనక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

తిరుపతి మంగళం : తిరుపతి 50వ డివిజన్ పరిధిలోని తిమ్మినాయుడుపాళెం దళితవాడలో మృతులకు అంత్యక్రియలు చేయడం సమస్యగా మారుతోంది. ఇక్కడి శ్మశాన స్థలం ఆక్రమణకు గురి కావడంతో స్థానికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలోనే బుధవారం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి మరణిస్తే సమీపంలోని రిజర్వు ఫారెస్ట్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. దీనిపై పలువురు స్థానికులతోపాటు అటవీశాఖ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. అయితే దళితవాడ వాసులు మాత్రం సర్వే నంబర్ 199లోని 1.45ఎకరాలను తాతల ముత్తాల నాటి నుంచి శ్మశానంగా వాడుకుంటున్నామని, స్థానిక టీడీపీ నేత కాయం వెంకటరత్నం, తదితరులు ఆ భూమిని కబ్జా చేశారని వెల్లడిస్తున్నారు. అధికారులు స్పందించి శ్మశాన స్థలంలో ఆక్రమణలు తొలగించి, గ్రామానికి అప్పగిస్తే అక్కడే అంత్యక్రియలు జరుపుకుంటామని తేల్చిచెబుతున్నారు. ఈ విషయాన్ని జిల్లా అటవీశాఖ అధికారి సతీష్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన మాట్లాడుతూ రిజర్వు ఫారెస్ట్‌లో మృతదేహాలను కాల్చినా, పూడ్చినా చర్యలు తప్పవని హెచ్చరించారు. శ్మశానస్థల వివాదంపై కలెక్టర్‌కు నివేదిక సమర్పించామన్నారు. ఆయన ఆదేశాల మేరకు తగు చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. అప్పటి వరకు ఎవరూ అటవీప్రాంతంలోకి వెళ్లకూడదని ఆదేశించారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక బస్సులు

తిరుపతి అర్బన్ : తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుపతి– తమిళనాడు మధ్య ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు నడపాలని తమిళనాడు అధికారులు, జిల్లా ఆర్టీసీ అధికారులు నిర్ణయించారు. ఈనెల 30 నుంచి అక్టోబర్ 13వ తేదీ వరకు మొత్తం 300 బస్సులు నడపాలని ఇరు రాష్ట్రాల అధికారులు ఒప్పందం కుదుర్చుకున్నారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి, డిప్యూటీ సీటీఎం భాస్కర్, చెన్నై నగరం ఎండీ ఆర్.మోహన్, జీఎం వి.గుణశేఖరన్, వేలూరు జీఎం ఏ.గణపతి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రాధాష్టమి వేడుకలు

తిరుపతి కల్చరల్ : ఇస్కాన్ మందిరంలో బుధవారం శ్రీకృష్ణభగవానుని ఇష్టసఖి రాధాదేవి జన్మాష్టమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 4 గంటలకు మంగళహారతి, నరసింహ కీర్తన, తులసి కీర్తన, హరేకృష్ణ మహా మంత్ర జపం చేపట్టారు. శ్రీరాధాగోవిందులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 11 నుంచి 12.30 గంటల వరకు శ్రీరాధాగోవిందుల ఉత్సవమూర్తులకు మహా శంఖాభిషేకం జరిపించారు.అనంతరం రాధారాణి లీలలపై ఇస్కాన్ మందిరం అధ్యక్షుడు రేవతి రమణదాస్ ప్రత్యేక ప్రవచనం ఇచ్చారు. పెద్దసంఖ్యలో భక్తులు రాధాగోవిందులను దర్శించుకుని భక్తి సంకీర్తనలతో భజనలు చేశారు. కార్యక్రమంలో ఇస్కాన్ మందిరం కార్యదర్శి లీలాపారాయణదాస్, రూపేష్ ప్రభు పాల్గొన్నారు.

రూ.2,71,116 పలికిన లడ్డూ



లడ్డూను దక్కించుకున్న భక్తుడు చరణ్‌రెడ్డి

తిరుపతి కల్చరల్ : కోటకొమ్మల వీధి యూత్ ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం వద్ద బుధవారం స్వామివారి లడ్డూ వేలం వేశారు. చరణ్‌రెడ్డి అనే వ్యక్తి రూ.2,71116లకు లడ్డూ దక్కించుకున్నారు. అలాగే 29వ డివిజన్ కార్పొరేటర్ ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో చేపట్టిన లడ్డూ వేలం పాటలో రూ.10,116లు పలికింది. కార్యక్రమంలో మేయర్ శిరీష, కార్పొరేటర్లు కల్పన, శైలజ, రేవతి, ఊటకుంట మోహన్ పాల్గొన్నారు.


బాధ్యతల తొలగింపు

తిరుపతి తుడా: తిరుపతి రుయా నర్సింగ్ గ్రేడ్–1 సూపరింటెండెంట్ నుంచి కొన్ని బాధ్యతలు తొలగించారు. ఆ బాధ్యతలను గ్రేడ్–2 కి అప్పగిస్తూ రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు నిర్ణయం తీసుకున్నారు.

నిందితులకు బెయిల్

తిరుపతి లీగల్ : తిరుపతి సప్తగిరి నగర్ లో వినాయక విగ్రహం ఎదుట అసభ్య నృత్యాలు చేయించిన కేసులో ఏడుగురు నిందితులకు తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు నిందితులు ప్రతి శనివారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల లోపల అలిపిరి పోలీస్ స్టేషన్‌లో హాజరుకావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బాలల మనోవికాసానికి ‘కథలు’




పిల్లల్లో పఠనాసక్తిని పెంపొందింపజేసేందుకు రచయిత ఆర్‌సీ.కృష్ణస్వామి రాజు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారు. బాలలకు సులభతరంగా అర్థమయ్యే రీతిలో కథల పుస్తకాలను ప్రచురించి అందుబాటులోకి తీసుకువస్తున్నారు. వృత్తిపరంగా ఆయన ఎల్ఐసీ ఉద్యోగిగా పదవీ విరమణ పొందినా రచనా ప్రవృత్తిని మాత్రం కొనసాగిస్తున్నారు. ఈ మేరకు గతంలో పల్లెల్లో పిల్లల ఆటలు, వారి జీవన ప్రవర్తనలు, నీతి, న్యాయం, ధర్మం వైపు నడిపే కథలు, బాలల మనోవికాసానికి తోడ్పడే కథలని పుస్తక రూపంలో సమాజానికి అందించారు. ఇటు భాష, అటు సంస్కృతి, సంప్రదాయాల రక్షణకు తోడ్పాటునందిస్తున్నారు. ప్రతి కథకి ఆకర్షణీయమైన బొమ్మతో కూడిన ముద్రణ చేయిస్తున్నారు. హాస్యకథలు, బామ్మలు ఊ కొడుతూ చెప్పే కథలు, మానవ సంబంధాలు, కుటుంబ సభ్యుల మధ్యన అనురాగాలు, గురు శిష్యుల సంబంధాలు వంటి కథాంశాలతో ప్రేరణాత్మకంగా కథలను అందిస్తున్నారు. పిల్లల మనసులో ఆలోచనలను తట్టి లేపి సన్మాన మార్గంలో నడిచేటట్లు ప్రేరేపిస్తున్నారు.



రచయిత ఆర్‌సీ.కృష్ణస్వామి రాజు

పల్లెజీవనం ప్రతిబింబించేలా పేరూరి రచనలు



కొరమేనుగుంటలో వ్యవసాయ కుటుంబానికి చెందిన కథా రచయిత పేరూరు బాలసుబ్రమణ్యం. నలభై ఏళ్లుగా ఆయన రచనలు సాగిస్తున్నారు. పల్లె జీవనం ప్రతిబింబించేలా కథలను రచించి నేటి తరానికి అందిస్తున్నారు. మనిషిలో ఆలోచనలు రేకెత్తిస్తూ మానవీయ కోణం ఆవిష్కరణకు తోడ్పాటు అందిస్తున్నారు. సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం తన కథా రచనలతో ముందడుగు వేస్తున్నారు. చిన్నతనంలోనే పోలియో గురై నడక లేకున్నా.. భాష పట్ల మక్కువతో కథలను పుస్తరూపంలో అందిస్తూ సమాజ మార్పు కోసం పరితపిస్తున్నారు. ఇందులో భాగంగానే అనేక కథా రచనలు చేశారు. రైతుల జీవన విధానాన్ని ఆవిష్కరిస్తూ ఇటీవలే మడకెద్దులు పేరిట అద్భుత పుస్తకం అందించారు.



రచయిత పేరూరు బాలసుబ్రమణ్యం


అక్షరానికి ఆలంబన

తేనెలొలుకు తెలుగు భాషకు పాశ్చాత్య పోకడలు గొడ్డలిపెట్టుగా మారాయి. మధురమైన మాతృభాషను కనుమరుగు చేసేందుకు యత్నిస్తున్నాయి. ఇంతటి క్లిష్ట పరిస్థితుల్లో కొందరు కవులు.. రచయితలు అక్షరానికి ఆలంబనగా నిలుస్తున్నారు. మన సంస్కృతి.. సంప్రదాయాలు.. మానవీయ సంబంధాలను ప్రతిబింబిస్తూ పుస్తకాలను ఆవిష్కరిస్తున్నారు. నేటి యువతలో నైతిక విలువలు పెంపొందించేందుకు తమదైన శైలిలో రచనలు వెలువరిస్తున్నారు. పుస్తక పఠనంపై ఆసక్తిని పెంచేందుకు దిశానిర్దేశం చేస్తున్నారు. మనసును రంజింపజేసే అద్భుత సంఘటనలను ఆలోచింపజేసేలా సమాజానికి అందిస్తున్నారు. కల్పనకు సృజనాత్మకతను జోడించి హృదయం ఉప్పొంగేలా రచనా వ్యాసంగం కొనసాగిస్తున్నారు.

– తిరుపతి కల్చరల్


- మాతృభాష సంరక్షణకు శ్రమిస్తున్న కవులు
- సమాజానికి దిశానిర్దేశం చేస్తున్న రచయితలు
- పఠనాసక్తిని పెంపొందించేలా ఆవిష్కృతమైన పుస్తకాలు

విలువల పరిరక్షణకు మానవ వికాస వేదిక



ఆధునిక సమాజంలో కనుమరగుతున్న మానవీయ విలువలను పెంపొందించాలనే సంకల్పంతో నిరంతరం పుస్తక ప్రచురణలతో అడుగులు వేస్తూ సమాజ శ్రేయస్సుకు దిక్సూచిగా నిలిచిన సంస్థ మానవ వికాస వేదిక. మానవ వికాస వేదిక గౌరవాధ్యక్షుడిగా భూమన కరుణాకరరెడ్డి, సమన్వయ కర్తలుగా డాక్టర్ సి.శైలకుమార్, సాకం నాగరాజు అద్భుతమైన కథా సంకలనాల ముద్రణతో సమాజ హితం కోసం శ్రమిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రముఖుల స్వీయ చరిత్రలు, మహనీయుల జీవిత కథలను పుస్తకాలుగా అందిస్తున్నారు. మానవీయ విలువల పెంచే దిశగా అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల ఆరడుగుల నేల పేరిట కథల పుస్తకాన్ని సమాజానికి అందించి ప్రశంసలు అందుకున్నారు. పర్యావరణ ప్రాముఖ్యతను చాటే కొత్త నీలిగొను, సాటి వారిని మనిషిగా గుర్తించమని చెప్పే బెర్ర్‌టాండ్ రస్సెల్ సృష్టి కథ, పిడికెడు పక్షికి ఉన్నంత బుద్ధి..జ్ఞానం చెట్టంత మనిషికి లేకపోతే ఎలా అని ప్రశ్నించే ఆనందాల యువరాజు కథ, జీవితానందం గురించి స్పష్టం చేసే జీవితానందం కథలను ఒకే పుస్తకంగా పదివేల కాపీలు ముద్రించి పిల్లలకు పంపిణీ చేశారు.

గాంధీజీ ఆశయాలకు దర్పణం పట్టిన మూరిశెట్టి



స్వతహాగా రైతు అయినా మూరిశెట్టి గోవింద్ తొలుత సమాజ చైతన్యం కోసం నిరంతరం శ్రమించిన మహనీయుల పట్ల మక్కువ పెంచుకున్నారు. వారి జీవిత సంఘటనలను ఇతి వృత్తంగా చేసుకొని కథ, నవలా రచనలు చేసి నేటి తరానికి అందించారు. చిన్నతనం నుంచి గాంధీజీ పుస్తకాలు చదివి ప్రేరణ పొందారు. సమాజ హితం కోసం, ప్రజల అభ్యున్నతి కోసం పరితపించినా గాంధీ స్ఫూర్తికరమైన జీవితాన్ని నేటి తరానికి అందించేందుకు ఇటీవల సుధీర్ఘ స్వప్నం పేరిట అద్భుత నవలను అందించారు. సోక్రటీస్, గౌతమ బుద్ధుడు, లెనిన్, కారల్ మార్క్స్ వంటి వారి స్థాయిలో ప్రపంచ సమాజ గతిని నూతన పంథాలో నడిపించిన నేత గాంధీజీ అని తన రచనల్లో పేర్కొన్నారు. గాంధీజీ నడిచిన సత్యశోధన, , శాంతియుత విధానం, అహింసా మార్గాన్ని తన రచనల్లో ఆవిష్కరించారు.



రచయిత మూరిశెట్టి గోవింద్

వైఎస్సార్‌సీపీ నేతకు మాతృవియోగం



నివాళులర్పిస్తున్న భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : తిరుపతి 38వ డివిజన్ పరిధిలోని సింగాలగుంటకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత సుబ్రమణ్యం తల్లి బుధవారం కన్నుమూశారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి వెంటనే సుబ్రమణ్యం నివాసానికి వెళ్లి ఆయన తల్లి భౌతికకాయానికి నివాళులర్పించారు.

విలేకరి వేధింపులపై ఆగ్రహం

తిరుపతి కల్చరల్ : రామచంద్రాపురం మండలానికి చెందిన ఓ పత్రిక (సాక్షి కాదు) విలేకరి వనమాలి కొత్తవేపకుప్పం పంచాయితీ, పాత వేపకుప్పం గ్రామాల్లోని ప్రతి విషయంలో జోక్యం చేసుకొని గ్రామస్తులను వేధిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నాడని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో పాత వేపకుప్పానికి చెందిన చంద్రశేఖర కృష్ణమూర్తి మాట్లాడారు. పోలీసులు, రెవెన్యూ అధికారుల పేర్లు చెప్పి గ్రామస్తులను నిత్యం బెదిరిస్తూ భయాందోళనకు గురిచేస్తున్నారని వెల్లడించారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి విలేకరిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో బాధితులు ఎ.వెంకటరెడ్డి, ఈశ్వరమ్మ, దాము, చంద్రబాబు, మాధవి, కృష్ణమ్మ, సంజీవిరెడ్డి, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

అటవీ రక్షణ అందరి బాధ్యత



అమరవీరుల స్తూపానికి నివాళులర్పిస్తున్న యశోదబాయ్

తిరుపతి మంగళం : అటవీ రక్షణ అందరి బాధ్యతని తిరుపతి కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ యశోదబాయ్ తెలిపారు. బుధవారం తిరుపతి ఎస్వీ జూపార్క్ వద్ద క్యూరేటర్ సెల్వం ఆధ్వర్యంలో జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల స్తూపానికి నివాళులర్పించారు. అనంతరం అటవీశాఖలో విధులు నిర్వహిస్తూ ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల కుటుంబాలను యశోదాబాయ్ సత్కరించారు. తిరుపతి జిల్లా అటవీశాఖాధికారి సతీష్, సోషల్‌ఫారెస్ట్ డీఎఫ్‌వో ధర్మరాజు, ఫ్లెయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో శివకుమార్, సబ్ డీఎఫ్‌వో శ్రీనివాస్, జూ అసిస్టెంట్ క్యూరేటర్ సీహెచ్. నాగభూషణం పాల్గొన్నారు.

స్వార్థంతోనే ప్రజలను ముంచేశారు

- చంద్రబాబు ఇంటిని కాపాడుకునేందుకే వరదనీటిని మళ్లించారు
- బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం
- వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి



తిరుపతి మంగళం : చంద్రబాబు తన స్వార్థం కోసం విజయవాడ వాసులను ముంచేశారని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కరకట్ట మీద తన ఇంటిని కాపాడుకోవడం కోసం వేల ఇళ్లను ముంచేసిన దుర్మార్గుడు చంద్రబాబు అని మండిపడ్డారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో వాతావరణ శాఖ, నీటి పారుదల విభాగం ముందస్తు హెచ్చరికలను జారీ చేస్తుందని, వాటిని ప్రజలకు తెలియజేసి అప్రమత్తం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుందన్నారు. ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న వారిని రక్షిత ప్రదేశాలకు తరలించడం, వారికి కావాల్సిన కనీస వసతులు, ఆహారం, నీరు అందించడం తక్షణం చేపట్టాల్సి ప్రభుత్వం ఆ విషయంలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. భారీ వర్షాలు వరదలు వస్తాయని ముందే తెలిసినప్పటికీ ప్రజలను అప్రమత్తం చేయలేదని, సహాయక చర్యలు చేపట్టలేదని, కనీసం గ్రౌండ్ ఫ్లోర్ లో ఉన్న వారిని ఖాళీ చేయించే ప్రయత్నం కూడ చేయలేదని మండిపడ్డారు. కేవలం చంద్రబాబు నాయుడు ఇల్లు, ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ యాక్టివ్ పవర్ ప్లాంట్ మునిగి పోకుండా కాపాడేందుకే బుడమేరు నుంచి నీటిని వెలగలేరు రెగ్యులేటర్ ద్వారా విజయవాడ మీదకు వదిలేశారని స్పష్టం చేశారు. దీంతోనే విజయవాడ ప్రజలకు ఇంత ఘోరమైన పరిస్థితి వచ్చిందని వివరించారు. వరదలతో అక్కడి ప్రజలు తినడానికి తిండిలేక, తాగడానికి గుక్కెడు నీళ్లు లేక అలమటిస్తుంటే చంద్రబాబు అక్కడికి వెళ్లి షోలు చేయడం తప్ప చేసింది ఏమీ లేదని విమర్శించారు. చంద్రబాబు తప్పిదం కారణంగా 50 మంది మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం, వరద తగ్గుముఖం పట్టిన తర్వాత కూడా కనీస వసతులకు నోచుకోని దుస్థితలో లక్షల మందినరకయాతన అనుభవించడం దారుణమన్నారు. చంద్రబాబు స్వార్థ రాజకీయం ఇప్పటికే విజయవాడ ప్రజలకు అర్థమైందని చెప్పారు. అధికారులను వెంట వేసుకుని తిరగడం తప్ప వారికి పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించి పర్యవేక్షించే ప్రయత్నం చేయలేదన్నారు. రోజుకు మూడు నాలుగు సార్లు ప్రెస్ మీట్ లు పెట్టి అంతా తానే చేస్తున్నట్లు భ్రమ కల్పిస్తున్నారని విమర్శించారు.


ఘనంగా మిథున్‌రెడ్డి జన్మదినోత్సవం



రక్తదానం చేస్తున్న హరిప్రసాద్‌రెడ్డి తదితరులు

తిరుపతి సిటీ : రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం తిరుపతిలో ఘనంగా నిర్వహించారు. ఎస్వీయూ ప్రధాన ద్వారం వద్ద రాయలసీమ విద్యార్థి విభాగం వైఎస్సార్‌సీపీ నేత హరిప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో 60మంది విద్యార్థులు, నాయకులు రక్తదానం చేశారు. పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి చేతుల మీదుగా కేక్ కట్ చేశారు. వారు మాట్లాడుతూ ప్రజాసేవే లక్ష్యంగా నిరంతరం పరితపించే ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి వెన్నంటి ఉంటామన్నారు. కార్యక్రమంలో సత్యవేడు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి నూకతోటి రాజేష్, బీరేంద్ర వర్మ, పి.మురళీధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసులు ఓవర్ యాక్షన్ చేశారు. పుట్టిన రోజు వేడుకలను అనుమతి తీసుకోలేదని హరిప్రసాద్ రెడ్డిపై కేసు నమోదు చేసి స్టేషన్‌కు తరలించారు. ముఖ్యంగా సీఐ రామయ్య అత్యుత్సాహంపై పలువురు అసహనం వ్యక్తం చేశారు.

ఘనంగా గణేశ్ నిమజ్జనం



ఇంజినీరింగ్ అధికారులకు లడ్డూ అందిస్తున్న మేయర్ శిరీష, కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా : తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో కొలువుదీరిన వినాయకుని నిమజ్జనోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. మేయర్ శిరీష, కమిషనర్ మౌర్య విశేష పూజలు చేశారు. అనంతరం స్వామి వారి వద్ద ఉంచిన లడ్డూ వేలం వేయగా, ఇంజినీరింగ్ విభాగం వారు రూ.3.10 లక్షల దక్కించుకున్నారు. ఈ క్రమంలో కార్పొరేషన్ కార్యాలయం నుంచి ఊరేగింపుగా వెళ్లి వినాయక సాగర్ లో నిమజ్జనం చేశారు. కార్పొరేటర్ మునికృష్ణ, అదనపు కమిషనర్ చరణ్ తేజ్‌రెడ్డి, ఉప కమిషనర్ అమరయ్య, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, వెంకట్రామి రెడ్డి, డీఈ విజయకుమార్ రెడ్డి, సెక్రటరీ రాధిక, డీసీపీ శ్రీనివాసులు రెడ్డి, ఆర్‌ఐలు సేతుమాధవ్, కేఎల్ వర్మ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, మేనేజర్ చిట్టిబాబు పాల్గొన్నారు.



ముదిరిన భూ వివాదం

- ఆక్రమణకు యత్నించిన జనసేన నేతలు
- అడ్డుకున్న స్థానికులు

చంద్రగిరి(తిరుచానూరు) : తిరుచానూరు రంగనాథ రోడ్డులోని భూ వివాదం ముదురుతోంది. గత 20 ఏళ్లుగా పేదలు నివాసముంటున్న స్థలంలో అక్రమంగా ప్రవేశించేందుకు జనసేన నేతలు బుధవారం యత్నించడంతో స్థానికులు అడ్డుకున్నారు. తిరుచానూరులో సర్వే నంబరు 418/1, 418/2లో సుమారు 210 అంకణాలను స్థానికులు 20 ఏళ్ల క్రితం కొనుగోలు చేసి, శాశ్వత నివాస గృహాలను ఏర్పాటు చేసుకున్నారు. ఈ క్రమంలో కోడూరు చెందిన ప్రసాద్, తిరుచానూరు రంగనాథ్ రోడ్డుకు చెందిన బాధితుల మధ్య భూ వివాదం తెలుసుకున్న జనసేన నేత దేవర మనోహర్ వివాదంలోకి తల దూర్చాడు. బుధవారం ప్రసాద్‌తో కలసి దేవర మనోహర్, ఆయన అనుచరులు అక్కడకు చేరుకున్నారు. వారు స్థలంలోకి వెళ్లేందుకు యత్నించడంతో స్థానికంగా నివాసముంటున్న 20 కుటుంబాలు అడ్డుకున్నాయి. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఇరువర్గాల వారిని సర్దిచెప్పారు. 2014లో ప్రసాద్ అనే వ్యక్తి నారాయణ పిళ్లై వద్ద ఈ స్థలాన్ని కొనుగోలు చేశాడని, అప్పటి నుంచి తన భూమిలోకి ప్రవేశిస్తుంటే అడ్డుకుంటున్నారని జనసేన నేత దేవర మనోహర్ మీడియాకు వివరించారు. నకిలీ పత్రాలను సృష్టించి రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, బాధితుడు ప్రసాద్‌కు జనసేన అండగా నిలుస్తుందని బాధితులు ఆరోపించారు. పేదల భూమికి రాజకీయ రంగు పులిమి వివాదాన్ని మరింత పెద్దది చేయడానికి జనసేన నాయకులు యత్నించడంపై స్థానికులు మండిపడ్డారు. కూలీ పనులు చేసుకునే వారికి రాజకీయాలు ఆపాదించడం ఏంటంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



స్థానికులతో వాగ్వాదానికి దిగిన దేవర మనోహర్

రుయాలో అవగాహన ర్యాలీ

తిరుపతి తుడా : ప్రపంచ ఆత్మహత్యల నివారణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం రెండో రోజు తిరుపతి రుయా నుంచి ఎస్వీ మెడికల్ కళాశాల వరకు అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖరన్ మాట్లాడుతూ అధిక ఒత్తిడితో అనేక మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఇది సమస్యకు పరిష్కారం కాదని స్పష్టం చేశారు. ప్రొఫెసర్ డాక్టర్ రాధాకృష్ణన్ రాజు మాట్లాడుతూ మానసిక ఒత్తిడిని అధిగమించడంపై యువత దృష్టి సారించాలన్నారు.



ర్యాలీలో వైద్యులు, విద్యార్థులు

కార్యక్రమంలో డాక్టర్ మల్లికార్జునరావు, డాక్టర్ భూపాల్ నాయుడు ,డాక్టర్ కిషోర్, డాక్టర్ భారతి, డాక్టర్ కవిత, డాక్టర్ జాహ్నవి, డాక్టర్ పవన్ , డాక్టర్ మురళి నాయక్, డాక్టర్ రోహిత్, డాక్టర్ రాఘవ పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

పాకాల : మండలంలోని పంటపల్లె, ఊటువంక గ్రామాల్లో దోమల నివారణకు చర్యలు చేపట్టారు. బుధవారం ఈ మేరకు పీహెచ్‌సీ వైద్యాధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ ఇళ్ల పరిసరాల్లో మురుగు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ శివయ్య, ఎంపీహెచ్ఏ అయ్యప్ప పాల్గొన్నారు.

14 నుంచి పవిత్రోత్సవాలు

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు టీటీడీ అధికారులు బుధవారం తెలిపారు. 13వ తేదీ సాయంత్రం పవిత్రోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిపించనున్నట్లు వెల్లడించారు.

నర్సుకు ఆర్థికసాయం

తిరుపతి తుడా : రుయా ఆసుపత్రి అత్యవసర విభాగంలో మానసిక రోగి దాడిలో గాయపడిన నర్సు యశోద వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు. బుధవారం ఈమేరకు రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు చేతులమీదుగా ఆమెకు రూ.32వేల చెక్ అందించారు.

కొనసాగుతున్న స్టాఫ్‌నర్సుల ఆందోళన

తిరుపతి తుడా: ఏఎన్ఎంలకు స్టాఫ్ నర్సులుగా అవకాశం కల్పిస్తూ తీసుకువచ్చిన జీఓను వ్యతిరేకిస్తూ కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు చేపట్టిన ఆందోళన మూడోరోజు బుధవారం కొనసాగింది. వారు మాట్లాడుతూ ఏఎన్ఎంలకు ఉద్యోగోన్నతులను కల్పిస్తే తాము అవకాశాలు కోల్పోతామని ఆందోళన వ్యక్తం చేశారు.

ఆర్థికసాయం

పాకాల : ఇటీవల రోడ్డు ప్రమాదంలో భర్తను కోల్పోయిన నాగవేణి అనే మహిళకు బుధవారం పత్తిపాటివారిపల్లెకు చెందిన ఎల్ఎస్ నాయుడు తన పుట్టినరోజు సందర్భంగా రూ.10 వేల ఆర్థికసాయం అందించారు.